క్లుప్తంగా

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ వార్డులో తాగునీరు సరఫరా కావడం లేదని శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. శనివారం తాగునీటిని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ మోటార్లు పాడైపోయాయని, దీనివల్ల ఒక్కరోజు మాత్రమే నీటిని సరఫరా చేయలేదని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన పేర్కొన్నారు.

11న 3 కే రన్, శారీ వాక్



చినకాకాని(మంగళగిరి): మాతృ దినోత్సవం సందర్భంగా ఈనెల 11న 3 కే రన్ నిర్వహించనున్నట్లు వీ వైబ్ సంస్థ అధినేత రాఘ వీణ తెలిపారు. శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘ వీణ మాట్లాడుతూ 3 కే రన్‌తో పాటు శారీ వాక్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేతన్నలను గౌరవించుకునేందుకు నేత చీరలు కట్టి మహిళలు పాల్గొనాలని ఆమె కోరారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు ఎన్‌ఆర్‌ఐ జంక్షన్ వద్ద గౌతమ బుద్ధా రోడ్డులో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నటు తెలిపారు. తొలుత శారీ వాక్, అనంతరం రన్ నిర్వహిస్తామని వివరించారు. అనంతరం నేతన్న చేతితో తయారైన వస్త్రాలతో మహిళల ఫ్యాషన్ షో, నృత్య నిపుణురాలు ప్రీతి సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.

రేపు తాడికొండలో దివ్యాంగులు, వృద్ధులకు శిబిరం

తాడికొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వృద్ధులు, దివ్యాంగులకు పరికరాల పంపిణీ నిమిత్తం శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె. సమతావాణి ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్య్ర రేఖకు దిగువ నున్న దివ్యాంగులకు, వయో వృద్ధులకు ఆర్టిఫీషియల్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఆలింకో), హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఉపకరణాలు, సహాయ పరికరాలు పంపిణీ కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వృద్ధులు రేషన్ కార్డు, ఆధార్, రెండు ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఫొటోస్టాట్ కాపీలు, మొబైల్ నంబరుతో హాజరుకావాలని ఆమె సూచించారు.

9న తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడికొండ: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె. సమతావాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని సూచించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు తమ శాఖల పరిధిలోని ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

నేడు మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో పర్యటన

తాడేపల్లి రూరల్: ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో ఆదివారం పర్యటించనున్నట్లు తాడేపల్లిలోని ఆయన కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో గల శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు మంగళగిరి పట్టణ పరిధిలోని భగీరథ దేవస్థానం వద్ద నిర్వహించే జయంతి వేడుకల్లో పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన బైబిల్ శిక్షణ తరగతులు



మంగళగిరి టౌన్: నగర పరిధిలోని పత్మాస్ ప్రార్థన మందిరంలో గత నెల 24 నుంచి జరుగుతున్న విరామ బైబిల్ పాఠశాల తరగతులు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పత్మాస్ ప్రార్థన మందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ గోపాలకృష్ణ థియేటర్, గౌతమ బుద్ధా రోడ్ టిప్పర్ల బజార్ మీదుగా జరిగింది. వెయ్యిమందికి పైగా విద్యార్థులు, 200 మందికి పైగా టీచర్లు పాల్గొన్నారు. విద్యార్థులు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న పాటలను నటన రూపంలో వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో దైవసేవకులు ప్రసన్నకుమార్ రాజు, ఆనంద్, క్రీస్తుదాసు, జాన్ సామ్యేల్, సంఘ పెద్దలు ఎలీషా, చార్లెస్ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

- రాత్రి పార్కింగ్ చేస్తే తెల్లారి కల్లా మాయం
- గత నాలుగు నెలల్లో 40 వాహనాల చోరీ
- ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు
- అంతంత మాత్రంగా రికవరీ
- సీసీ కెమెరాలున్నా భయపడని దొంగలు

మంగళగిరి: నగరంతో పాటు చుట్టపక్కల ప్రాంతాల్లో బైక్ చోరీలు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మూడు రోజుల్లో మూడు వాహనాలు చోరీకి గురికావడం ఆందోళనకు గురి చేస్తోంది. ద్విచక్ర వాహనం ఎక్కడ పార్కింగ్ చేసినా భద్రత లేకుండా పోయింది. కల్యాణ మండపాలు, కన్వెన్షన్లు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలు, బ్యాంక్‌లు, ఏటీఎంలు.. ఇలా ఎక్కడ పార్కింగ్ చేసినా వాహనాలకు భద్రత లేదు. లోపలికి వెళ్లి పని చూసుకుని వచ్చే సరికి బైక్ మాయమవుతున్న ఘటనలు రోజురోజుకీ పెరుగుతుండటం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది. కొత్త వాహనాన్ని కొనాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

పట్టించుకోని పోలీసులు

ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు నార్త్ జోన్ సబ్‌డివిజన్ పరిధిలోని మంగళగిరి, మంగళగిరి రూరల్, తాడేపల్లి, తాడేపల్లి రూరల్, దుగ్గిరాల, పెదకాకాని స్టేషన్ల పరిధిలో 40కుపైగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవడం చూస్తే దొంగలు ఏ స్థాయిలో రెచ్చిపోతున్నారో అర్థమవుతుంది. జనం తిరుగుతున్నా ఇంటి ముందు వీధిలో పార్కింగ్ చేసిన బైక్‌లు చోరీలకు గురవుతుండడం విశేషం. బైక్ చోరీలపై ఫిర్యాదులు అధికంగా అందుతున్నా పోలీసులు కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదు. ఒకవేళ చేసినా రికవరీపై దృష్టి సారించకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా



సీసీ కెమెరాలో నమోదైన బైక్ చోరీ

రికవరీ ఉండకపోవడం, నెలల తరబడి స్టేషన్ చుట్టూ తిరగడంతో పాటు రికవరీ చేస్తే మరలా కోర్టుకు వెళ్లి తీసుకోవడం కాలయాపన తప్పా ప్రయోజనం లేదని కొందరు ఫిర్యాదు కూడా చేయడం లేదు.

నకిలీ తాళాలతో దొంగతనాలు

తాళాలు వేసి ఉన్న బైక్‌లను దొంగలు చాకచక్యంగా తస్కరిస్తున్నారు. ముందుగా బైక్‌పై సరదాగా కూర్చున్నట్లు నటిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా నకిలీ తాళం వినియోగించి ఎత్తుకుపోతున్నారు. ఇందులో జల్సాలుకు అలవాటుపడి, ఇంట్లో ఇచ్చే డబ్బులు చాలక ఇద్దరు, ముగ్గురు యువకులు గ్రూపులుగా ఏర్పడి బైక్‌లు చోరీ చేసున్నట్లు అధికారులు చెబుతున్నారు. నగరం సీసీ కెమెరాల నిఘాలో ఉన్నా బైక్ చోరీలు యథేచ్ఛగా చోరీలు జరుగుతుండడం విశేషం. నివారణకు యజమానులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం



వీధుల్లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతున్న సంఘటనపై ఫిర్యాదులున్నాయి. వాహన యజమానులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఫంక్షన్ హాల్స్, కల్యాణ మండపాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం, రోడ్ల మీద పార్కింగ్ చేస్తుండటం దొంగలకు మరింత అవకాశం ఇస్తున్నారు. ఇళ్ల వద్ద వీధుల్లో పార్కింగ్ చేయడం మానుకోవాలి. సీసీ కెమెరాల సాయంతో దొంగలను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–మురళీకృష్ణ, డీఎస్పీ నార్త్ జోన్ సబ్ డివిజన్

కుల గణన అంశంపై రాజకీయాలు తగదు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

మంగళగిరి టౌన్: జనగణనతో పాటు దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపడతామంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని పలు రాజకీయ పార్టీలు రాజకీయం చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు తెలిపారు. నగర పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో సగం మందికి పైగా ఉన్న ఓబీసీలకు కుల గణన వల్ల మేలు జరుగుతుందని తెలిపారు. కుల గణన కోసం దశాబ్దాలుగా బీసీ సంఘాలతో పాటు వివిధ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలోని కేంద్రమంత్రి మండలి జనగణనతో పాటే జాతీయ స్థాయిలో సమగ్ర కుల గణనను కూడా చేయాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడాన్ని ఓబీసీ సమాజం హర్షిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీలు సంబరాలు జరుపుకుంటున్న వేళ, బిహార్ ఎన్నికల్లో విజయం కోసమే ఈ నిర్ణయం అంటూ ప్రతిపక్షాలు విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరామ్ బాబాజీ, ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ఉపాధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఫలతుష్షేక్ అష్రఫ్ ఫైజీ హాఫిజ హుల్లాహ

మంగళగిరి టౌన్ : ఉన్నత చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఫజీలతుష్షేక్ అష్రఫ్ ఫైజీ హాఫిజహుల్లాహ్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా షాదీఖానాలో మదరసా ఆయిషా సిద్దీఖా 12వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అష్రఫ్ ఫైజీ హాఫిజహుల్లాహ్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా మదరసా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని చక్కని ప్రతిభ కనబర్చడం హర్షణీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ప్రాపంచిక విద్యతో పాటు ధార్మిక విద్యను కూడా అభ్యసించేలా చూడాలని సూచించారు. అలిమ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మదరసా ప్రిన్సిపల్ అబ్దుల్ అలీమ్ జామయీ, అన్సారీ ఇస్లామిక్ సెంటర్ అధ్యక్షులు మొహమ్మద్ జహంగీర్, కమిటీ సభ్యులు సిలార్, షబ్బార్, ఖదీర్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురికి సత్కారం



ముగ్గురికి సత్కారం చేసిన జిల్లా ఏఎస్పీ రమణమూర్తి , సిబ్బంది

నగరంపాలెం: పోలీస్ శాఖ నుంచి రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) ఏవీ రమణ మూర్తి అన్నారు. జిల్లా ఏఆర్ విభాగం ఏఎస్ఐ ఏ రాఘవరాజు, తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. వీరిని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. జిల్లా ఏఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ పోలీస్ శాఖ అన్నివేళల్లో అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాసరావు, సంక్షేమ ఆర్ఐ శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, హుస్సేన్, మైలా సాంబశివరావు, కరిముల్లా పాల్గొన్నారు.

హేమలతకు నివాళి అర్పించిన మంద కృష్ణమాదిగ



హేమలత చిత్రపటం వద్ద నివాళి అర్పించిన కృష్ణమాదిగ

తెనాలి: భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ అనుచరుడు పమిడిపాగ రాజారావు సతీమణి, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ సలహా మండలి మాజీ సభ్యురాలు ఆరుగొలను జాస్మిన్ మాతృమూర్తి హేమలత మరణం తీరనిలోటని ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. తెనాలికి చెందిన హేమలత ఏప్రిల్ 23న మృతిచెందారు. విషయం తెలిసిన మంద కృష్ణమాదిగ శనివారం రాత్రి చెంచుపేట, అమరావతి ప్లాట్స్‌లోని వారి స్వగృహానికి విచ్చేశారు. హేమలత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆరుగొలను జాస్మిన్‌కు తన సానుభూతిని తెలియజేశారు. బాబూ జగజ్జీవన్‌రామ్‌లో తొలినుంచీ సత్సంబంధాలు కలిగి, భారత దేశంలోనే తొలిసారిగా జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని తెనాలిలో నెలకొల్పింది పమిడిపాగ రాజారావు కుటుంబమేనని కృష్ణమాదిగా ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జాతిని చైతన్యపరచటంలో భర్తకు తోడుగా నిలిచిన హేమలత ధన్యురాలని అన్నారు. పలువురు ఎమ్మార్పీయస్ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి మహాసభల్లో పాల్గొనాలి



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి వలి

తెనాలిఅర్బన్: అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరుగుతాయని, అందరూ దీనిలో పాల్గొనాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి షేక్ వలి కోరారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం గాంధీనగర్‌లో శనివారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభల్లో యువతలో సామాజిక స్పృహను పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక నిరాకుశ పాలనను సభల్లో ఎండగట్టనున్నట్లు చెప్పారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని, విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రధాని మోడీ చరిత్రహీనుడుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ కార్యదర్శి రాజేష్ బిల్లా, జిల్లా సహాయ కార్యదర్శి పాశం వెంకటేష్, నాయకులు కోలా శేఖర్, మన్నెం నరేంద్ర, శరత్, హేమంత్, రాము పాల్గొన్నారు.

పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలి



తాడికొండ: నియోజకవర్గంలో సోషల్ మీడియా వింగ్‌ను బలోపేతం చేసి పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) సూచించారు. నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడుగా ఎన్నికైన ఐనవోలు సుధీర్ శనివారం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు, అంకితభావంతో పనిచేసి 2029 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

దుగ్గిరాల: మండలంలోని సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పిల్లల పేర్లు నమోదు, డెమోగ్రాఫిక్, బయోమెట్రిక్ నవీకరణ, మార్పులు, చేర్పులు సరిచేసుకోవచ్చని ఆయన సూచించారు. 5న దుగ్గిరాల, శృగారపురం సచివాలయాలు, 6న దుగ్గిరాల, పెదపాలెం సచివాలయాలు, 7న చిలువూరు, గొడవర్రు సచివాలయాలు, 8న తుమ్మపూడి, పెదకొండూరు సచివాలయాలు, 12న రేవేంద్రపాడు నార్త్–4 అంగన్వాడీ కేంద్రం, మోరంపూడి సచివాలయం, 13న రేవేంద్రపాడు నార్త్–4 అంగన్వాడీ కేంద్రం, ఈమని సచివాలయం, 14న కె.ఆర్.కొండూరు ఎలిమెంటరీ పాఠశాల, ఈమని సచివాలయం, 15న పెనుమూలి–2 అంగన్‌వాడీ కేంద్రం, పేరుకలపూడి సచివాలయంలో క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించాలని ఆయన కోరారు.

తుళ్లూరు మండలంలో...

తాడికొండ : తుళ్లూరు మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కానూరి శిల్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న అనంతవరం, మందడం–1 సచివాలయం, 6న అనంతవరం , మందడం–2, 7న పెదపరిమి–1, తుళ్లూరు–1, 8న పెదపరిమి–2, తుళ్లూరు–2 సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఫిరంగిపురంలో..

మండలంలోని నాలుగు గ్రామాల్లో 5వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. 5నుంచి 8 వరకు గొల్లపాలెం పంచాయతీ కార్యాలయం, పొనుగుపాడు సచివాలయం వద్ద క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు. 12వ తేదీ నుంచి 15 వరకు అమీనాబాద్–2 సచివాలయం, ఫిరంగిపురంలోని 3వ వార్డు, 15 వవార్డు అంగన్‌వాడీ సెంటర్లలో క్యాంపులు నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఆధార్ నమోదు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీసులను అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న నిర్వహించనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని తాడేపల్లి సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ కంపెనీల మేనేజర్లకు, గోడౌన్‌లో మేస్త్రీలకు శనివారం సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. నాయకులు బూరుగ వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు వెంకటయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు దర్శనపు సామ్యేల్, వైఎస్సార్ టీయూ నాయకులు శ్రీనివాసరాజు, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె. ఆదినారాయణ పాల్గొన్నారు.

సవాళ్లతో కూడుకున్నది పోలీస్ ఉద్యోగం



నాగేశ్వరరావు, పద్మావతి దంపతులను సత్కరిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

తాడేపల్లి రూరల్: పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉన్నదని పలువురు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. తాడేపల్లి స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బండ్ల నాగేశ్వరరావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు నాగేశ్వరరావు, పద్మావతి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా నాగేశ్వరరావు సమర్థంగా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని తెలిపారు. సీతానగరం వద్ద కృష్ణానదిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిని అడ్డుకుని వారికి ధైర్యం చెప్పి, కౌన్సెలింగ్ ఇవ్వడంలో ఆయనకు ఆయనే సాటి అని అధికారులు ప్రశంసించారు. కార్యక్రమంలో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐలు ప్రతాప్, శ్రీనివాసరావు, ఖాజావలి, స్టేషన్ సిబ్బంది నాగేశ్వరరావుకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మహిళలకు రూ. 72లక్షల విలువైన యంత్రాల పంపిణీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పెమ్మసాని

నీరుకొండ(మంగళగిరి): కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత తీసుకుని గ్రామాల అభివృద్ధితో పాటు మహిళల ఆర్థిక పురోభివృద్ధికి సహకరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి , సమాచార శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద చుట్టపక్కల గల గ్రామాల్లోని మహిళలకు వివిధ రకాల ఉత్పత్తుల కోసం రూ. 72 లక్షల విలువైన యంత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సహకారం అందించడం అభినందనీయమన్నారు. పేదరికంతో నలిగిపోయే మహిళలు ఆత్మస్థైర్యంతో నూతన వ్యాపారాలు ప్రారంభించాలని,ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎంటర్‌ప్రెన్యూర్ , ఇన్నోవేషన్ డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాఠి అదితి, వీసీ మనోజ్ కుమార్ అరోరా, ప్రో వీసీ సతీష్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ భూములను సంరక్షించింది కార్మికులే ..



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ భూములను సంరక్షించింది కార్మికులే అని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలకోట్ల రూపాయల విలువైన ఏసీసీ భూముల్ని సంరక్షించింది కార్మికులే అన్నారు. ఈ విషయాన్ని యాజమాన్యం, ప్రభుత్వం గుర్తించుకుని కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి. నాగేశ్వరరావు, కార్మికులు సాంబశివరావు, హగ్గయ్య, గురవయ్య, ఆశీర్వాదం, ఇమాండి, సారమ్మ, సువర్ణకుమారి, విజయశ్రీ, దుర్గా భవాని, రమణ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న ఆరుగురు అరెస్టు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు టేకు తోట వద్ద బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రాత్రి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి, ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పేకాట, కోడి పందేలపై ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి అరికట్టనున్నట్లు తెలిపారు.

ఆంధ్రులను మోసం చేసిన ప్రధాని మోదీ



మాట్లాడుతన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ జీ

తెనాలి అర్బన్: ఆంధ్రులను ప్రధాని మోదీ మోసం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ విమర్శించారు. గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ అమరావతి పర్యటనలో రాష్ట్ర విభజన హామీలపై మాట్లాడకపోవడం బాధకరమన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజ్ కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతికి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. మోదీ రాక వలన రాష్ట్రానికి ఒరిగిందేమిలేదని విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసే 107, 108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ నాగరాజు, నాయకులు చెన్నూరి సాయి, తేజ, జయదీప్, నవీన్; వివేక్, శేఖర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాకారుడు పెద్దిరాజు హఠాన్మరణం



టీవీ పెద్దిరాజు (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్గాన్ కీ–బోర్డు విద్వాంసుడు 'ఇస్కఫ్' కార్యవర్గ సభ్యుడు, అభ్యుదయ కళాసమితి సంగీత దర్శకుడు టీవీ పెద్దిరాజు (51) శుక్రవారం రాత్రి పొద్దుపోయాక నెహ్రూ రోడ్డులోని స్వగృహంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దిరాజు తండ్రి టి.రామారావు మ్యూజికల్ బ్యాండ్ పార్టీ–క్లారినెట్ విద్వాంసుడు. తండ్రి మరణం తర్వాత పెద్దిరాజు బ్యాండ్‌ను నడుపుతూ 50 మంది సంగీత కళాకారులతో రాష్ట్రంలో వందలాది ప్రదర్శనలిచ్చారు. 'ఇప్టా' ఆధ్వర్యంలో హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర సభలో పుత్తడిబొమ్మ పూర్ణమ్మ నృత్యనాటిక, గోదాదేవి కళ్యాణం, పోస్టర్ నాటికలకు సంగీతాన్ని అందించారు. 'రక్తకన్నీరు' నాగభూషణం, మాదాల రంగారావు ప్రశంసలందుకున్నారు. పట్టణానికి చెందిన సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ, సైదారావు, సదాశివ, సుభాని సహా జిల్లాకు చెందిన సంగీత కళాకారులు, బ్యాండ్ పార్టీలు, స్థానిక ప్రముఖులు డాక్టర్ రావిపాటి వీరనారాయణ, డాక్టర్ కె.రామరాజు, బెల్లంకొండ వెంకట్, నాగప్రసాద్, అలపర్తి వెంకటేశ్వరరావు, ఉమాశంకర్ తదితరులు పెద్దిరాజు భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. సినీ సంగీత దర్శకులు కోటి, వాసూరావులు ఫోనులో పెద్దిరాజు కుటుంబసభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. అనంతరం అంతిమ యాత్ర ఘనంగా జరిగింది.